సచివాలయ సిబ్బందిపై కత్తి కట్టిన కూటమి సర్కార్

గత ప్రభుత్వంలో ప్రజలకు ఇళ్ల ముంగిటకే సేవలందించిన సచివాలయ వ్యవస్థను అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందనే విమర్శలొస్తున్నాయి. గత ప్రభుత్వ పాలనలో పలు రకాల సేవలతో కిటకిటలాడిన సచివాయాలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం సిబ్బందికి పలు రకరకాల సర్వేలను అంటగట్టడదంతో సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లవలసి వస్తోంది. దీనికితోడు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయకపోతే కొందరు ఎంపీడీఓలు షోకాజ్ నోటీసులను జారీ చేస్తున్నారు. ఈ ఒత్తిళ్లు భరించకలేక రాష్ట్రంలో ఇటీవల ఓ సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య చేసుకోవడం చూస్తే వీరి పరిస్థితి ఎలా ఉందో ఇట్టే బోధపడుతుంది. –పలమనేరు

- నిర్వీర్యమైన సచివాలయ వ్యవస్థ
- 500 పైచిలుకు సేవలకు మంగళం
- పలు సర్వే పనులు అప్పగించిన టీడీపీ కూటమి ప్రభుత్వం
- టార్గెట్ అందుకోకపోతే ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు
- అడకత్తెరలో పోకచెక్కలా మారిన సచివాలయ సిబ్బంది పరిస్థితి


గత ప్రభుత్వంలో జనంతో కిటకిటలాడుతున్న పలమనేరులోని ఓ సచివాలయం (ఫైల్)


కూటమి పాలనలో సిబ్బంది లేకుండా ఉన్న వెలవెలబోతున్న పెద్దపంజాణి మండలంలోని మాడి సచివాలయం

గత ప్రభుత్వ పాలనలో వీరి విధులిలా...

పంచాయతీ కార్యదర్శి సెక్రటరీ గ్రేడ్–5: సాధారణపరిపాలన, గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చూసేవారు. డిజిటల్ అసిస్టెంట్ 540 రకాల సేవలకు సంబంధించి కంప్యూటర్‌లో నిక్షిప్తం, ఆపై డాక్యుమెంటేషన్, అవసరమైన సర్టిఫికెట్ల జారీ ఉండేది.

వెల్ఫేర్ అసిస్టెంట్: ప్రభుత్వ పథకాల అమలు, బడుల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు పర్యవేక్షణ, గ్రామంలో శానిటేషన్.

సెరికల్చర్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు: వీరు ఆయా శాఖలకు సంబంధించి సహాయకులుగా ఉంటూ ఆయా రైతు సేవా కేంద్రాల్లో రైతులకు విత్తనాలు, పురుగు మందుల సరఫరా, పంటల బీమా తదితర సేవలందించేవారు. అలాగే ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్ల సాయంతో అక్కడ అవరసమైన వైద్య సేవలను అందించేవారు. మండల సర్వేయర్‌కు సపోర్ట్‌గా విలేజి సర్వేయర్, ఉండాలి. పాడి రైతుల అనిమల్ హజ్బెండరీ అసిస్టెంట్ సేవలందించేవాళ్లు.

టీడీపీ కూటమి పాలనలో వీరి విధులేమంటే...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 540 సేవలను ఆపేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ఎటూ లేదు. ప్రస్తుతం హౌస్ హోల్డ్ జియో టాగింగ్, ఎంఎస్ఎంఈ(చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు)పై రుణాల సర్వే, ఎస్‌పీసీఐ లింకేజీ, ఆధార్‌తో బ్యాంకు ఖాతాలు లింక్, ఇంటింటా ఆరోగ్య సర్వే, స్వర్ణ పంచాయతీ డాటాఎంట్రీ, ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ విద్యార్థులకు రుణాల సర్వే, పాఠశాలల విజిట్, టాయ్‌లెట్ల ఫొటోల అప్ లోడింగ్, సంచార జాతుల సర్వేలతోపాటు ప్రతి నెలా సామాజిక పింఛన్ల పంపిణీ విధులు నిర్వర్తించాలి.

పలమనేరు నియోజకవర్గంలో సచివాలయాల వివరాలు	
5మండలాలు, మున్సిపాలిటీతో కలిపి	108 సచిచాలయాలు
ఒక్కో సచివాలయంలో సిబ్బంది	10 మంది దాకా
మొత్తం సచివాలయాల్లో	1,100 మంది వరకూ

నాడు కళకళ.. నేడు వెలవెల

గ్రామాల్లోనే ప్రజలకు అవసరమైన 540 రకాల సేవలు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అందేవి. దీంతో ఆయా సచివాలయాలు జనంతో కిటకిటలాడేవి. కూటమి ప్రభుత్వం ఈ సేవలకు మంగళం పాడింది. సిబ్బందిని సర్వేలకు పురమాయించడంతో సచివాలయాలన్నీ బోసిగా దర్శనమిస్తున్నాయి. పేరుకు భవనాలున్నా అక్కడ ఎలాంటి సేవలు లేకుండా పోయాయి.

టార్గెట్ కాలేదంటే షోకాజ్ నోటీసులు

ఇప్పుడు వీరికిచ్చిన సర్వే పనులకు సిబ్బంది అంతా గ్రామాలకు పరుగులు తీస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడైనా నెట్‌వర్క్ సమస్య తలెత్తితే సకాలంలో సర్వే కాదు. అయితే ఇదంతా తమకు సంబంధం లేదని, పని జరగాల్సిందేనని ఎంపీడీలు వారిపై ధాం ధూం అని చిందులేస్తున్నారు. తాజాగా పింఛన్ల పంపిణీ రోజులోపు పూర్తి చేయలేదని శాంతిపురం మండలంలోని సచివాలయ సిబ్బందికి అక్కడి ఎంపీడీఓ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై ఎవరైనా సచివాలయ ఉద్యోగి నోరు తెరిస్తే ఇక వారి సంగతంతే!



శాంతిపురం సచివాలయ ఉద్యోగులకు పంపిన నోటీసు

సచివాలయ ఉద్యోగులను టార్గెట్ చేయడం తగదు



సచివాలయాల ఉద్యోగులపై కూటమి ప్రభుత్వంలో అధికారులు టార్గెట్ చేయడం తగదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాకు రకరకాల సర్వేల పేరిట వత్తిళ్లకు గురి చేస్తున్నారు. మూడునెలలు పింఛను తీసుకోకున్నా ఒకేసారి మూడునెలల పింఛను తీసుకోవచ్చని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో బయటి ప్రాంతాల్లోని కొందరు పింఛనుదారులు హమ్మయ్య..ఎప్పుడైనా పింఛన్లు తీసుకోవచ్చని ఉదాసీనంగా ఉంటున్నారు. దీనిని అధికారులు ఆలోచించకుండా పింఛన్లు బట్వాడా చేసే తొలి రోజే టార్గెట్‌లు ఎందుకు తగ్గాయంటూ ఎంపీడీఓ సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులను ఇవ్వడం శోచనీయం.

–మురళీనాథ్, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

సీనియర్ సివిల్ జడ్జిగా ఆరిఫా షేక్

పుంగనూరు: పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జిగా ఆరిఫా షేక్‌ను నియమిస్తూ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కుప్పం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న ఆమెకు ఉద్యోగోన్నతి కల్పించి పుంగనూరుకు బదిలీ చేశారు. త్వరలో ఆమె బాధ్యతలు స్వీకరిస్తారు.

జూనియర్ కాలేజీకి విరాళంగా కంప్యూటర్లు


కంప్యూటర్లను అందజేసిన దశరథరెడ్డి

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం మంగళవారం వి.కోటకు చెందిన దశరథరెడ్డి రూ1.20 లక్షల విలువ చేసే మూడు కంప్యూటర్లను విరాళంగా అందజేశారు. ప్రిన్సిపల్ జయప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడానికి అవసరమైన కంప్యూటర్లను అందజేయడం ఆనందంగా ఉందని దాతకు కృతజ్ఞతలు తెలియజేసి సన్మానించారు. కాలేజీ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని దశరథరెడ్డి చెప్పారు. విద్యార్థులు కంప్యూటర్లను సద్వినియోగం చేసుకుని చదువుల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

మండల స్థాయి మోడల్ ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు


విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జెడ్పీ హైస్కూల్లో మంగళవారం చిత్తూరు జిల్లా స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పులిచెర్ల, కల్లూరు హైస్కూల్ విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్షలు నిర్వహించినట్లు హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ నెల 8, 12, 24వ తేదీల్లో చిత్తూరులో నిర్వహించనున్న ప్రధాన పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం 12 వేల రూపాయలు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట సిద్ధులు, వేణుగోపాల్, మోహన్, మురళీమోహన్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

నేడు అబకదొడ్డిలో 'ప్రజా దర్బార్'

శాంతిపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'ప్రజా దర్బార్–మన పంచాయతీ వద్దకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం అబకలదొడ్డిలోని ఐటీఐ ఆవరణలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కుమార్ తెలిపారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడ పీడీ మురళ్మత్ తదితరులు పాల్గొంటారని, అబకలదొడ్డి పంచాయతీ ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీఎం ధర్నా


మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పలమనేరు: పట్టణంలోని 19వ వార్డులో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సీపీఎం నాయకులు గిరిధర్ గుప్తా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ, వార్డులో సమస్యలు రాజ్యమేలుతున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. నాయకులు రమేష్, మహ్మద్, ఖైరున్నీసా, హరి, బీబీజాన్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా సద్వినియోగం చేసుకోండి


రైతులకు అవగహన కల్పిస్తున్న ఏఓ

వి.కోట: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి రాజ్యలక్ష్మి కోరారు. మంగళవారం మండలంలోని ముదరందొడ్డి, చింతమాకులపల్లి పంచాయతీలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి, వేరుశనగ పంటలకు బీమా నిమిత్తం ప్రీమియం చెల్లించాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల వలన పంటలు నష్టపోతే బీమా ఆదుకుంటుందని చెప్పారు. వేరుశనగ పంటకు డిసెంబర్ 15లోపు, వరికి నెలాఖరులోపు ప్రీమియం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రప్ప, సిబ్బంది జాస్మిన్, రాజుకుమార్, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

శిక్షణతో సులువుగా అర్థమయ్యేలా విద్యాబోధన


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జయప్రకాష్

బైరెడ్డిపల్లి: విద్యార్థుల భవితకు బాటలు వేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్షణ ప్లానింగ్ కో–ఆర్డినేటర్ జయప్రకాష్ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. 3,4,5 తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి సులువుగా అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో టీఏఆర్ఎల్ క్లాసులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుబ్రమణ్యం, రిసోర్స్ పర్సన్స్ చైతన్యాచారి, శశికుమార్, సురేఖ, మోహన్ పాల్గొన్నారు.

అభ్యసన స్థాయి గుర్తింపుపై శిక్షణ


మాట్లాడుతున్న ఎంఈఓలు

పులిచెర్ల(కల్లూరు): విద్యార్థుల్లో అభ్యసన స్థాయి గుర్తింపు (టీచింగ్ ఎట్ రైట్ లెవల్)పై మండలంలోని 3,4,5 తరగతులకు తెలుగు, గణితం బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం పులిచెర్ల హైస్కూల్లో నిర్వహించినట్లు ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య మంగళవారం తెలిపారు. ప్రాథమిక స్థాయిలో రాయడం, చదవడం, చతుర్విధ ప్రక్రియలో విద్యార్థుల అభ్యసన స్థాయి మెరుగు పరచడమే శిక్షణ ముఖ్యోద్దేశమన్నారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ లోకనాథం, జోనల్ కో–ఆర్డినేటర్ గోపి పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగు ఉత్తమం


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నాగరాజు

గుడుపల్లె: రబీ సీజన్‌లో ఆరుతడి పంటల సాగు చేయడమే ఉత్తమమని వ్యవసాయశాఖ అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం పెద్దబదినవాడ గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వర్షాలు సక్రమంగా పడకపోవడంతో చెరువులు, బోరు బావుల్లో నీటి మట్టం పడిపోయిందని, దీంతో రైతులు ఆరుతడి పంటల సాగుపై మొగ్గు చూపాలని కోరారు. నీటిని ఆదా చేసుకోవడానికి 90 శాతం రాయితీలతో డ్రిప్ పరికరాలు పొందవచ్చన్నారు. రబీ సీజన్‌లో సాగు చేసిన వరి, టమాట, వేరుశనగ పంటలకు ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాలలో సంప్రదించి బీమా చేసుకోవాలని కోరారు.

పేదలకు తప్పని రేషన్ బియ్యం కష్టాలు

- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్ హైదర్


సంచార వాహనంలో బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

పలమనేరు: మున్సిపాలటీ పరిధిలోని 17వార్డులో రేషన్ కార్డుదారులకు సంచార వాహనంలో బియ్యం ఇవ్వకుండా రేషన్ దుకాణం వద్ద అధిక ధరలకు బియ్యాన్ని విక్రయిస్తున్నారని 17వ వార్డు కౌన్సిలర్ హైదర్ తహసీల్దార్ ఇన్బునాథన్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చౌకబియ్యం ఎక్కడ పంపిణీ చేస్తారో తమ వార్డు ప్రజలకు తెలియడం లేదన్నారు. ఇక్కడి స్టోర్ వద్దకెళితే అధిక ధరలకు నిత్యావసరాలను విక్రయిస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే మిగిలిన డబ్బుకు సోపులు ఇస్తున్నారని మండిపడ్డారు. దీనిపై తహసీల్దార్ వివరణ కోరగా ఎంపీడీఓ ఆదేశాల మేరకే బియ్యం పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.

నియామకం


నానబాల మణి

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గ కాపు (బలిజ) సంఘం అధ్యక్షుడుగా పట్టణానికి చెందిన నానబాల మణిని నియమిస్తూ మంగళవారం జాతీయ కాపు సంఘ వ్యవస్థాపకులు మురళీకృష్ణ నాయుడు నియామక పత్రం పంపారు. మణి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని కాపుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండ కృషి చేస్తామని తెలిపారు.

టీచర్లకు శిక్షణ

పుంగనూరు: పట్టణంలోని బసవరాజ ప్రభుత్వ పాఠశాలలో టీచర్లకు తరల్ శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఆకర్షణీయమైన పద్ధతితో విద్యాబోధన, గుణాత్మక విద్య అందించే విషయాలపై రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షించారు.

పొంగుతున్న వంకలు, వాగులు


మంగళంపేట సమీపాన వంక ప్రవాహం

పులిచెర్ల(కల్లూరు): తుపాను వలన నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు వంకలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో చిన్నచిన్న కుంటలు నిండాయి. చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి. ఫలితంగా భూగర్భ జలాల మట్టం పెరిగి బోర్లలోకి నీరు చేరుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

7న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్

పుంగనూరు: ఈ నెల 7న మండలంలోని 138 పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య స్నేహపూర్వక సంబంధాలు నెలకొల్పి, విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం ఈ కార్యక్రమ నిర్వహణకు పూనుకుందని, తల్లిదండ్రులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అయ్యో! ఎంత కష్టం వచ్చిందే తల్లీ..

తమ సంతానం అభ్యున్నతికి రెక్కలు ముక్కలు చేసుకుని జీవన చరమాంకానికి చేరుకున్న తల్లిదండ్రులను కన్నబిడ్డలే నిర్దయగా వదిలించుకుంటున్న సందర్భాలు అడపాదడపా చూస్తున్నాం. ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న పలమనేరుకు చెందిన మాతృమూర్తి కూడా అలాంటి అనుభవాన్ని తన సంతానం నుంచి చవిచూసింది. అయితే అనుకోని మలుపులు తిరిగి 'అమ్మ ఒడి' చొరవతో మళ్లీ కుటుంబ సభ్యుల దరికి చేరింది!


వృద్ధురాలికి అండగా నిలిచిన సామాజిక సేవకులు

పలమనేరు: 'సాక్షి' సేకరించిన వివరాల మేరకు.. ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న పండుటాకు పేరు రత్నమ్మ. ఇప్పుడామె వయసు 82 ఏళ్లు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే జన్మించింది. ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. మనవలూ, మనవరాళ్లు.. ఆ తర్వాత తరాలనూ ఆమె చూసింది. జీవితంలో పండిపోయింది. వృద్ధాప్యం తెచ్చిన అనారోగ్య సమస్యలు ఆమెను ఆస్పత్రి పాల్జేశాయి. గత నెల 21న ఆమెను బంధువులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. వైద్యులు, నర్సుల సేవలతో కోలుకున్న అనంతరం ఆమెను ఎనిమిది రోజుల క్రితం డిశ్చార్జి చేసినా కుటుంబ సభ్యుల జాడే లేదు. ఎవరూ ఆమెను తీసుకెళ్లలేదు. దీంతో ఆమెకు ఆస్పత్రిలోని రోగులు, వారి సహాయకులు పెట్టే ఆహారంతో రోజులు నెట్టుకొచ్చింది. ఈ నేపథ్యంలో చిత్తూరు పట్టణానికి చెందిన ప్రమీల, మోహన్ ఆమె సమస్యను తెలుసుకుని 'అమ్మ ఒడి' ఆశ్రమ నిర్వాహకుడు పద్మనాభనాయుడుకు సమాచారం ఇచ్చారు. మంగళవారం ఆయన రత్నమ్మ దరికి చేరుకుని ఆమె పూర్తి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసినప్పుడు ఆమె తన కుమార్తెలు, కుమారుల గురించి తెలియజేసింది. తన కుమారుల్లో ఒకడు ఆస్పత్రిలో చేర్చి వెళ్లిపోయినట్లు తెలిపింది. అయితే అతడు అడ్మిట్ చేసేటప్పుడు తన సెల్ నంబర్ కాకుండా తన సోదరీమణుల్లో ఒకరి నంబర్ ఇచ్చినట్లు తేలింది. ఆ నంబర్‌కు పద్మనాభనాయుడు కాల్ చేస్తే ఎట్టకేలకు లిఫ్ట్ చేసి మాట్లాడారు. ఇక ఆపై, సీన్ కట్ చేస్తే..

చిత్తూరు టు పలమనేరు

కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైందని నిర్ధారించుకున్న పద్మనాభనాయుడు రత్నమ్మను మంగళవారం మధ్యాహ్నం చిత్తూరు నుంచి ఒక కారులో పలమనేరుకు తీసుకువచ్చారు. ఎట్టకేలకు ఫోన్ నంబర్ తాలూకు రత్నమ్మ కుమార్తె వద్దకు వచ్చారు. కౌన్సెలింగ్ ఇచ్చి వారికి రత్నమ్మను అప్పగించారు. కన్నతల్లిని చూసుకోవడం బిడ్డల బాధ్యత అని హితవు పలికారు. మాతృమూర్తిని వదలించుకోవాలని చూసిన ఆ కన్నకొడుక్కి కూడా తన జీవిత చరమాంకంలో తన పిల్లల నుంచి ఇలాంటి పరిస్థితే ఎదురైతే..!? అనే ప్రశ్న ఉదయించింది.

వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు



దివ్యాంగ పిల్లలకు వాటర్‌బాటిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం, రామకుప్పంలో..

గంగవరం: ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలను చులకనగా చూడరాదని ఎంఈవో–2 శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులను తగిన సహకారం, ప్రోత్సాహం అందిస్తే వారు కూడా ప్రతిభ చాటుతారన్నారు. వైకల్యం శరీరానికేగానీ మనసుకి కాదనేది ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బంగారుపాళ్యంకు చెందిన మాజీ సైనికుడు వెంకటస్వామి భవిత కేంద్రంలో పిల్లలకు అవసరమైన వాటిని ఉచితంగా అందజేశారు. పాఠశాల టీచర్లు రూపాదేవి, ఐఈఆర్‌పీలు సురేఖ, త్రిలోక్, స్పెషల్ టీచర్ అశోక్ కుమార్, సీఆర్‌పీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఎంఈఓ నారాయణ అన్నారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, దివ్యాంగ పిల్లలను చిన్నచూపు చూడరాదన్నారు. అవసరమైన దివ్యాంగులకు థెరపీ, ఇలు ఆధారిత విద్యలో నిరంతరం శిక్షణ ఇవ్వాలని సూచించారు. దివ్యాంగులను భవిత కేంద్రంలో చేరిస్తే వారికి లభించే అలవెన్సుల గురించి ఐఈఆర్‌పీ ఉమాదేవి వివరించారు. జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుజాత, ఐఈడీఎస్ఎస్ కుమార్ నాయక్, ఫిజియోథెరపిస్ట్ రాజు పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: ప్రత్యేక ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకెళితే సకలాంగులకేమీ తీసిపోరని ఎంఈఓలు అన్నారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం మండల విద్యాశాఖ నిర్వహించింది. ఎంఈఓలు చంద్రశేఖర్, మురుగేష్ మాట్లాడారు. భవిత కేంద్రంలో ప్రత్యేక ప్రతిభావంతులకు మంచి విద్యాబోధన ఉందన్నారు. అలాగే భవిత కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుబ్రమణ్యం, నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం మాట్లాడారు. భవిత కేంద్రం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాత చెంచురెడ్డి 30మంది పిల్లలకు స్వెటర్లను అందజేశారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ మంగేశ్వరి, మురళి తదితరులు పాల్గొన్నారు.



వి.కోట: బహుమతుల ప్రదానం చేస్తున్న చేస్తున్న ఎంఈఓలు, పలమనేరులో..

సదుంలో భారీ వర్షం

- 60 ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట

సదుం: మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. ఫలితంగా గార్గేయ నదిలో ప్రవాహం పెరిగింది. కంభంవారిపల్లె సమీపంలోని సింహంగుండ్లు ప్రాజెక్టు నిండి మొరవపోతోంది. నడిగడ్డ కురవపల్లెలో సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్, గాండ్లపల్లె పరిధిలో విద్యుత్ పోల్ నేలకొరిగినట్లు ఏఈ చంద్రశేఖర్ తెలియజేశారు. అమ్మగారిపల్లె, గొంగివారిపల్లె, తిమ్మానాయనపల్లె, కంభంవారిపల్లె, బూరగమంద, పాలమంద, చెరుకువారిపల్లె పంచాయతీల పరిధిలో 60 ఎకరాలలో వరి పంట దెబ్బతిన్నట్లు ఏఓ హరిప్రసాద్ చెప్పారు. దెబ్బతిన్న వరి పంటకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు. అలాగే, సోమల మండలం సోమప్ప చెరువు నిండి వచ్చిన మొరవ నీటితో తిమ్మానాయనపల్లె వ్యాసప్ప చెరువు, చిక్కరాయ సముద్రం నిండి మొరవ పోతున్నాయి. మధ్యాహ్నం నుంచి వర్షం తగ్గి ఎండ కాయడం రైతులకు ఊరటనిచ్చింది.


చౌడేపల్లె:పెద్దకొండామర్రి వద్ద వర్షానికి దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న నవీన్ కుమార్

పంట నష్టం పరిశీలన

చౌడేపల్లె: తుపాను కారణంగా నష్టపోయిన పంటలను అధికారులు మంగళవారం పరిశీలించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ నవీన్‌కుమార్ పెద్దకొండామర్రి, పెద్ద యల్లకుంట్ల, కోటూరు, నాగిరెడ్డిపల్లె తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వరి, టమాట, బీన్సు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. వరి పంటలు వర్షపు నీటితో మునకేశాయి. పంటల నష్టం వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని నవీన్‌కుమార్ తెలిపారు. పంటలను ఒబ్బిడి చేసినప్పటికీ వరి ధాన్యం తడిసిపోగా గడ్డి ఎందుకు పనికిరాకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు.


సదుం: ఉధృతంగా ప్రవహిస్తున్న గార్గేయ నది